ఇలా అందిస్తే అలా చెయ్యి పట్టుకునే నేర్పు అతనికి పుట్టుకతో వచ్చింది.

గుమాస్తాలు ఇచ్చిన ట్రైనింగ్‌తో అతను రైస్ మిల్ వ్యవహారంలో ఆరితేరిపోయాడు. తరువాత మరొకటి - తరువాత ఇంకొకటి - అలా అలా అనేక వ్యాపార వ్యవహారాలు అతనే చూసుకోవడం మొదలెట్టాడు.

అంతే కాదు-

స్వంతంగా మరి కొన్ని వ్యాపారాలు మొదలెట్టాడు. అతని ప్రగతిని చూసి చలమయ్య మురిసిపోయాడు. కొడుకు అలా కలిసివచ్చి బిజినెస్ చూసుకుంటే తను 'కృష్ణా - రామా' అనుకుంటూ పూర్తిగా రాజకీయాల్లోకి దిగవచ్చని - తన పథకాలన్నీ ఫలిస్తే ఏ మంత్రి పదవో, కార్పొరేషన్ ఛైర్మన్ పదవో రాకపోదని చలమయ్య ఆశ...

తులసీరాం అన్ని విషయాల్లో బాగానే ఉంటాడు గాని - కొంగుని చూసేసరికి ప్రపంచాన్ని మరిచిపోతా డు.


ఒక్కోసారి చలమయ్య కా విషయం బాధ కలిగిస్తుంది. అంతలోనే ప్రపంచం మారింది - అనుకుంటాడు. పైగా తను వ్యాపారం మొదలుపెట్టిన రోజుల్లో ఆఫీసర్లతో పనులుంటే - ఏదో ఇంతని పైకం ముట్టజెప్తే సరిపోయేది - ఇపు డలా కాదు-

మందు, మగువ లేకుండా కొందరు ఆఫీసర్లు కాయితం కదపడంలేదు.

అటువంటి విషయాలు తులసీరాం చాలా నేర్పుగా సాధిస్తాడు.

"అదీ మంచిదేలే. కొంచెం ఆ ఫీల్డు కూడా తెలుస్తుంది. రే పో పిల్లని కట్టేస్తే అదే పడుంటాడు" అనుకున్నాడు చలమయ్య.

ప్రపంచ మంత నజావుగా సాగిపోతోంది.



రాజకీయాలు నజావుగా జరిగిపోతున్నాయి.

రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి 'చక్కగా' ఉందని హోంమంత్రిగారు ప్రకటన లిస్తున్నారు.

తమ ప్రభుత్వం తలపెట్టిన సంక్షేమ కార్యక్రమాలన్నీ విజయవంతంగా అమలు జరుగుతున్నాయని ముఖ్యమంత్రి ప్రతి మీటింగ్‌లోనూ చెప్తున్నారు.

వీలైనప్పుడల్లా చిన్న చిన్న విషయాలను కూడా ఎత్తి చూపి ప్రభుత్వాన్ని 'అవనిందలపాలు' చెయ్యడానికి ప్రయత్నిస్తున్నాయి ప్రతిపక్షాలు.

అసెంబ్లీలో తన కున్న మెజారిటీని తలుచుకుని ముఖ్యమంత్రి హాయిగా నిద్ర పోతున్నారు. విదేశీ శక్తులు దేశంలో అరాచకాన్ని సృష్టించడానికి ప్రయత్నిస్తున్నాయని, ప్రజలు అప్రమత్తులై ఉండాలని ప్రధానమంత్రి హెచ్చరిస్తున్నారు.

లేనివాళ్ళు ఏడుస్తున్నారు - లేదని.

ఉన్నవాళ్ళు ఏడుస్తున్నారు - చాలదని.

ఉండీ లేని వాళ్ళు ఏడవాలో, నవ్వాలో తెలియక బాధపడుతున్నారు.

అవినీతి నిరోధక శాఖాధికారులు అక్క డో గుమాస్తాని, ఇక్క డో ఇన్‌స్పెక్టర్‌ని లంచం తీసుకుంటుండగా పట్టుకుని పేపర్లో వేయిస్తున్నారు.

హైద్రాబాద్ లాంటి నగరాల్లో పోష్ కాలనీల్లో బిల్డింగుల మీద బిల్డింగులు లేచి పోతున్నాయి. సిమెంట్ బూడిద కన్నా సులభంగా దొరుకుతోంది.

పేపర్ల వాళ్ళు 'ప్రెస్ ఫ్రీడం' అణిచివెయ్యబడుతోందని గోల చేస్తున్నారు.

పోలీసులు లాఠీలకి పని లేదని చింతిస్తున్నారు.

రాష్ట్రంలో ఓ మూల జిల్లాలో ఓ మూల ప్రాంతంలో, ఓ మూల అడవిలో, ఓ మూల గెస్టుహౌస్‌లో ఓ మూల ఓ మంట రేగింది-

ముం దనలు పొగే లేచింది.

నిప్పు లేందే - పొగ రాదన్నారు.

నిప్పూ కనిపించింది.

నిప్పుని ఊది బాగా రాజుకునేట్టు చేస్తే మంట లేస్తుంది.

అవును - అన లా నిప్పుని రాజుగారే రాజేశారని చలమయ్యకి గట్టి అనుమానం.

లేచిన మంట రాష్ట్రాన్నంతటినీ చుట్టుముట్టేసింది. దానికి ఎవరు ఆహుతి అయిపోతారో, ఎలా అయిపోతారో తెలియని పరిస్థితి వచ్చింది.

అన లా మంట కథ ఏమిటంటే-

[సశేషం]

# ఆదివారం అతిథి

ఇలా నిద్ర లేచాడో లేదో, నానిగాడి బుర్రలో రాత్రి పడుకోబోయే ముందు ప్రోరోగ్ చేసుకున్న ఆలోచన కాలు జారిన కన్నె పిల్ల కక్కులా తన్ను కొచ్చింది; నిమిషానికి నూట యాభై మీటర్ల స్పీడ్‌తో. ఒక్కసారిగా మత్తంతా వదిలిపోయి, దిగ్గున లేచి కూర్చుని గదంతా డిటెక్టివ్‌లా కలియజూశాడు. ఆ చూపు కో అర్థం, పరమార్థం ఉన్నాయి. ఆ రోజు ఆదివారం కావడమే నానికి ఓ ప్రత్యేకత.

గత మూడు నెలలుగా నానికి మిస్టరీగా మారి పోయా డో పెద్ద మనిషి. నల్లగా, లావుగా, బొర్ర మీసాలతో, ఎర్రెర్రని చూపులతో భయంకరంగా ఉండే ఆ మనిషిని వారాని కోసారి చూస్తాడు నానీ. అదీ ఆదివారం నాడే

మిగతా రోజుల్లో ఎటుపోతా డో, ఏమైపోతా డో గానీ, ఆదివారం అయ్యేసరికి కొత్తల్లుడిలా వాలిపోతాడు. ఆ రోజంతా అయ్యగారి సేవలతోనే సరిపోతుంది నానీ తల్లి దేవకికి. ఇన్ని సేవలూ చేయించుకున్నా ఎప్పుడో తప్ప ఆమెతో నవ్వుతూ మాట్లాడడు. అప్పు డప్పుడు తల్లే ఆ వ్యక్తికి డబ్బు తీసి ఇస్తుండడం తనెన్నోసార్లు గమనిచాడు కూడా

తన కా మహానుభావుడి దగ్గరికి వెళ్ళాలంటేనే భయం. నవ్వుతూ పిలిచినా, బిక్కి బిక్కు మంటూ దూరంగానే నిల్చుంటుంటా డతను. బోడి వాడు తెచ్చే బిస్కట్ పేకట్ ఎవడి క్కావాలి? సబ్బుతో ఒళ్ళు రుద్దుకుని డ్రైనేజ్ నీటితో స్నానం చేసే ముఖము వాడూను.

నానీ వాళ్ళింట్లో టీ.వీ ఉంది. రోజూ చుట్టుపక్కల వాళ్ళు దాన్ని చూట్టానికి వస్తుంటారు. ఆ పెద్ద మనిషి ఆదివార మంతా టీ.వీ ముందే సెటిలైపోతుంటాడు. కొంపతీసి టీ.వీ. చూడటానికి గానీ దిగబడి పోతున్నాడేమో? మరి అమ్మెందుకు వాడికి భయపడాలి? మధ్యాహ్నం భోజనం ఎందుకు పెట్టాలి? వీడి వ్యవహార మేమిటో కాస్త కన్ఫ్యూజనే. ఆ ఇంటికీ, వాడికీ లింకేమిటో - ఇత్యాది ప్రశ్నలతో రెండేళ్ళ నాని గాడి మెదడు ఓవర్‌లో డైపోయింది.

ఆ రోజెలాగైనా తల్లిని నిలదీసి అడిగేయాలని దృఢంగా నిర్ణయించుకున్నాడు. జంకుతూనే వంట గదిలో ఉల్లి పకోడీలు చేస్తున్న దేవకి దగ్గరికి చేరాడు. తీరా అక్కడికి వెళ్ళాక ఏదో మీమాంస. ఓ ఐదు నిమిషాలు గడిచేసరికి దేవకే నాని అవస్థ గ్రహించి "ఏంట్రా కన్నా?" అంది లాలనగా దగ్గరికి లాక్కుని. అప్పటికి కాస్త ధైర్యం వచ్చింది నానికి.

"మరే .... అమ్మ ప్రతి ఆదివారం మనింటికి టీ.వీ చూడడానికి వచ్చేసే ఆ బూచాడు ఎవరే?"

అంతే. పాపం దేవకి నివ్వెరపోయింది. నాని గాడి నోట అలాంటి ప్రశ్నా? క్షణంలో ఆమెకి వాస్తవం అర్థమైంది.

"ఆయన మీ నాన్నేరా కన్నా. రోజూ నువ్వు నిద్ర లేవక ముందే డ్యూటీకి పోయి, రాత్రి నువ్వు నిద్రపోయాక వస్తుంటారు గదా, అందుకే నువ్వు చూసుండవు, ఆదివారం ఒక్కరోజే ఆయనకి సెలవు.

ఈ సారి నానికి మరో కొత్త అనుమాన మొచ్చింది.

"నాన్నంటే ఏమిటే అమ్మా?"

సి.వి.నరసింహదాసు

## సమయం

"మొక్కలకు నీళ్ళు పోయడానికి ఏ సమయం బాగుంటుంది?"

"పని లేని సమయంలో."

## నీలాగే

"ఇదిగో ఈ అయిదు రూపాయలు తీసుకొని భోంచేయ్. కానీ ఒక టడుగుతాను - నీ వంత శ్రీమంతుడివిగా. ఇలా ఎందు కైంది?"

"నీలాగే అడిగిన వాళ్ళికల్లా అయిదు పది ఇచ్చుకుంటూ పోవడం వల్ల."

చాగావురం